సచివాలయంలో వాస్తు మార్పులు!

- ప్రధాన ద్వారం నుంచి రాకపోకలు బంద్ చేయనున్న సీఎం
- తొమ్మిదవ అంతస్థుకు మారనున్న ముఖ్యమంత్రి కార్యాలయం
- కేసీఆర్ మార్పులు చేసినప్పుడు విమర్శలు.. ఇప్పుడు గప్‌చుప్

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సచివాలయంలో వాస్తు మార్పులు చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆరు నెలలైనా పాలన ఇప్పటికీ గాడిన పడకపోవడం, నిత్యం వివాదాలు, ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాలు వంటి పరిణామాల నేపథ్యంలో అనేక మార్పులు చేయిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా ముఖ్యమంత్రి కేంద్రంగా పలు మార్పులు చేయిస్తున్నట్టు తెలిసింది. ఇన్నాళ్లూ సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలోకి వెళ్లేందుకు తూర్పువైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని వినియోగించారు. వాస్తు మార్పుల్లో భాగంగా ఇకపై పశ్చిమం వైపు ఉన్న గేటు ద్వారా లోపలికి వస్తారని, ఈశాన్యం వైపు ఉన్న గేటు ద్వారా బయటికి వెళ్తారని చెప్తున్నారు. ఈ రెండు గేట్లను సీఎం కోసం మాత్రమే వినియోగిస్తారని తెలిసింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఇతర ఉన్నతాధికారులు ఆగ్నేయం వైపు ఉన్న గేటు ద్వారా లోనికి వెళ్లాలని ఆదేశాలు జారీ అయినట్టు చర్చించుకుంటున్నారు. రేవంత్‌రెడ్డికి ఇష్టమైన నంబర్ 9 అని, సచివాలయంలోని 9వ అంతస్థులోకి సీఎం కార్యాలయాన్ని మార్చాలని నిర్ణయించినట్టు గతంలో ప్రచారం జరిగింది. ఈ మేరకు ఇప్పటికే పనులు జరుగుతున్నట్టు సమాచారం. అవి పూర్తి కాగానే సీఎంవో మొత్తం 9వ అంతస్థులోకి చేరుతుందని చెప్పుకుంటున్నారు. వీటితోపాటు సచివాలయం లోపల మరికొన్ని మార్పులు చోటు చేసుకోబోతున్నాయని సమాచారం. సీఎం కార్యాలయం మార్పు అనంతరం, మంత్రుల చాంబర్లలో కూడా వాస్తు మార్పులు చేయించాలని భావిస్తున్నారట. ఇప్పటికే కొందరు మంత్రులు మార్పులు కావాలని కోరుతున్నట్టు చర్చ జరుగుతున్నది. మొత్తంగా రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న మొదటి వాస్తు మార్పులు ఇవే కావడం గమనార్హం.

ఇప్పుడు గప్‌చుప్?

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వాస్తు మార్పులు చేయిస్తే, మూఢనమ్మకాల సీఎం అంటూ దుష్ప్రచారం చేశారని బీఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి వాస్తు మార్పులు చేయిస్తున్నా, వారెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాస్తుమార్పులను విమర్శించిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మళ్లీ వాస్తు మార్పులు చేయించడం గమనార్హం.

అన్నారం బరాజ్‌లో నిలిచిన పనులు

- పట్టించుకోని రేవంత్ సర్కార్
- వర్షాకాలంలో వరదతో ఆటంకం
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు

అన్నారం బరాజ్ వద్ద నీటి బ్లాక్‌లో జరుగుతున్న లెవలింగ్ పనులు

మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్ వద్ద నిలిచిపోయిన మరమ్మతు పనులు

కాళేశ్వరం, జూన్ 3: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతీ) బరాజ్‌లో గ్రౌటింగ్ పనులు వరద కారణంగా ఆగిపోయాయి. ఈ పనులను వేసవిలోనే చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోరినా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోలేదు. తీరా వర్షాకాలం ముందు పనులు మొదలు పెట్టడంతో వరద కారణంగా పనులు నిలిచిపోయాయి. విలువైన సమయాన్ని వృథా చేసి వర్షాకాలంలో పనులకు శ్రీకారం చుట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్నారం బరాజ్‌లో డౌన్ స్ట్రీమ్‌లో 38వ పిల్లర్ గేట్ వద్ద జరుగుతున్న పనులు వర్షం కారణంగా ఆగిపోయాయి. మళ్లీ ఒకటి రెండు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్టు ఇంజినీర్లు తెలిపారు. అలాగే బరాజ్‌లో సీసీ బ్లాక్ పనులు కొనసాగుతున్నాయి. సీసీ బ్లాక్‌లు ఒక దాని పక్కన ఒకటి అమర్చి ఆ మధ్యలో లారీల ద్వారా ఇసుక తీసుకొచ్చి నింపుతున్నారు. బరాజ్ ముందు భాగంలో ఇప్పటికే 2 లక్షల టన్నుల ఇసుక తీశారు. మరో 7 లక్షల టన్నుల ఇసుక తీయాల్సి ఉన్నది. వర్షాలు భారీగా పడితే ఇసుక తీయడం ఆపేస్తారు.

మేడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు వర్షాకాలంలో దెబ్బతిన్న పిల్లర్ల వద్ద అప్, డౌన్ స్ట్రీమ్ ఏడు, ఎనిమిదో బ్లాక్‌లలో పనులు చేస్తున్నారు. బరాజ్ వద్ద జరుగుతున్న పనులను సోమవారం భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు పరిశీలించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్ వద్ద ఏర్పడ్డ ఖాళీ ప్రదేశాలను సిమెంట్, ఇసుకతో పూడ్చి వేసేందుకు గ్రౌటింగ్ పనులు జరుగుతున్నాయి. బరాజ్ దిగువన కుంగిన పియర్ల ప్రాంతంలో కాపర్ షీట్ ఫైల్స్‌ను అమర్చుతున్నారు. 20, 21 గేట్ల కట్టింగ్, డౌన్ స్ట్రీమ్‌లో క్రేన్‌ల సాయంతో సీసీ బ్లాక్ అమరిక పనులు చేపడుతున్నారు. ఆది వారం కురిసిన భారీ వర్షం నేపథ్యంలో సీఎస్ఎంఆర్ఎస్ (సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్), సీడబ్ల్యూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రిసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందాల సోమవారం నాటి పర్యటన వాయిదాపడినట్టు నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. నిపుణుల పర్యటన త్వరలో నిర్ణయించనున్నట్టు తెలిసింది.

హైకోర్టులో ఒకేరోజు 76 తీర్పులు

రికార్డు సృష్టించిన జస్టిస్ సూరేపల్లి నంద

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హైకోర్టు చరిత్రలో జస్టిస్ సూరేపల్లి నంద ఒకే రోజు అత్యధిక తీర్పులను వెలువరించి రికార్డు సృష్టించారు. వేసవి సెలవులు ముగిసిన తర్వాత సోమవారం హైకోర్టు పునఃప్రారంభమైంది. దీంతో ఆమె వేర్వేరు కేసుల్లో 76 తీర్పులను వెలువరించి రికార్డు నెలకొల్పారు.

ఏసీబీ వలలో ఇండస్ట్రియల్ ఏడీ

- వాహన తనిఖీ నివేదికకు రూ.45వేలు లంచం
- సూర్యాపేటలో సబ్ రిజిస్ట్రార్, మరో ఇద్దరు అరెస్టు
- ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ.లక్ష డిమాండ్
- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

మేడ్చల్ కలెక్టరేట్/సూర్యాపేటసిటీ, జూన్ 3: అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు వరుసగా దాడులు చేస్తున్నారు. రాష్ట్రంలో మరో ఇద్దరు అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కారు. మేడ్చల్ మల్కాజిగిరిలో జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ వెంకటనర్సిరెడ్డి, సూర్యాపేటలో సబ్‌రిజిస్ట్రార్ బానోతు సురేందర్‌నాయక్‌లు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ వెంకట నర్సిరెడ్డి రూ.45వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్‌కు చిక్కాడు. కూకట్‌పల్లిలోని ఎల్లమ్మ బండకు చెందిన కేతావత్ రమేశ్ రూ.53 లక్షలతో టీఎస్ ఐపాస్ పథకం కింద టిప్పర్‌ను కొనుగోలు చేశాడు. వాహన తనిఖీకి వచ్చిన ఏడీ వెంకట నర్సిరెడ్డి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చేందుకు రూ.45వేలు లంచం అడిగాడు. రమేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో సోమవారం జీడిమెట్లలో ఏడీ వెంకట నర్సిరెడ్డి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌కు తీసుకువచ్చి, ఆయన కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు.



ఏసీబీకి చిక్కిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ వెంకట నర్సిరెడ్డి

ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ.లక్ష డిమాండ్

ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ రూ.99,200 లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. సూర్యాపేటలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన మేక వెంకటేశ్వర్లుకు పట్టణంలో 1080 గజాల ఖాళీ స్థలంలో 160 చదరపు గజాల ఓపెన్ ప్లాట్‌ను తన కూతురు మేక మానస పేరున గిఫ్ట్ డీడ్‌గా, మిగిలిన భూమిని మేడిపల్లి రవిరాజా పేరున సేల్ డీడ్‌గా రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు సబ్‌రిజిస్ట్రార్ రూ. లక్ష లంచం డిమాండ్ చేశాడు. మధ్యవర్తి తంగెళ్ల వెంకట్‌రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ కల్లూరి శ్రీనివాస్ ద్వారా బాధితుడు సబ్‌రిజిస్ట్రార్‌కు ఆయన చాంబర్‌లో రూ. 99,200 లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఏసీబీ కేసుల కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

108లోనే పురుడు

- నిరుపేదకు అందని ప్రభుత్వ వైద్యం
- నెలలు నిండలేదనే కారణంతో మూడు చోట్ల వైద్యానికి నిరాకరణ

ములుగు, జూన్ 3 (నమస్తేతెలంగాణ):ములుగు జిల్లాలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ గర్భిణీకి ప్రభుత్వ వైద్యం అందకుండాపోయింది. నెలలు నిండలేదని ములుగు జిల్లాలోని మూడు ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు కాన్పు చేసేందుకు నిరాకరించడంతో వందల కిలోమీటర్ల ప్రయాణం అనంతరం 108లో ఈఎంటీ పురుడు పోసిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. వాజేడు మండల కేంద్రానికి చెందిన దబ్బకట్ల సుధాకర్ భార్య నాగలక్ష్మి గర్భిణీ కావడంతో ప్రతి నెలా వాజేడు పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్నది. ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు వెళ్లారు. అక్కడికి వచ్చిన నాగలక్ష్మిని పరీక్షించిన వైద్యులు నెలలు పూర్తిగా నిండలేదని కుటుంబ సభ్యులకు చెప్పి ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు 108 ద్వారా తరలించారు. ములుగు దవాఖానకు రాత్రి చేరుకున్న సదరు గర్భిణికి వైద్యం అందించాల్సిన వైద్యులు రిస్క్ డెలివరీ పేరుతో మరో 108 వాహనంలో హనుమకొండలోని గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ములుగు నుంచి 108లో హనుమకొండకు వెళ్తుండగా కటాక్షపూర్‌కు చేరుకునేలోగా నాగలక్ష్మి పురిటి నొప్పులు తీవ్రం కావడంతో పైలట్ కొలగాని శ్రీను వాహనాన్ని పక్కకు ఆపాడు. ఈఎంటీ నరేశ్.. నాగలక్ష్మికి పురుడు పోయగా, ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ములుగు ప్రభుత్వ దవాఖాన వైద్యులకు ఈఎంటీ తెలుపగా వారి సూచన మేరకు జీఎంహెచ్‌కు తరలించారు. అక్కడ తల్లీబిడ్డను పరీక్షించిన వైద్యులు వారు క్షేమంగా ఉన్నట్టు తెలిపి రెండు రోజులపాటు వైద్యం అందించేందుకు అడ్మిట్ చేసుకున్నారని ఈఎంటీ నరేశ్ తెలిపారు.

అరుణాచలం వెళ్లి.. ఐపీ పెట్టి!

ప్రియాంక చిట్స్ మోసం 500 కోట్లకు పైనే

- సీసీఎస్ పోలీసుల అంచనా
- 543 మందికి ఐపీ.. 145 మంది ఫిర్యాదు
- నిందితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): వడ్డీల ఆశ చూపారు.. కొన్నేండ్ల పాటు అసాధారణ స్థాయిలో వడ్డీలు చెల్లించారు. ఖాతాదారుల నమ్మకాన్ని పెట్టుబడిగా మార్చుకొని వందల కోట్లు కూడబెట్టారు. చివరికి తమ గట్టు రట్టయ్యే సమయం వచ్చిందని ఊహించారు. అరుణాచలం వెళ్లి దేవుడిని మొక్కుకున్నారు.. తిరిగి వచ్చి అందరికీ ఐపీ పెట్టారు. మెల్లిగా బిచాణా ఎత్తేద్దామనుకుంటుండగా.. అప్రమత్తమైన ఖాతాదారులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గత నెల 30న ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులను అరెస్టు చేశారు. నిందితులు 543 మందికి ఐపీ నోటీసులు పంపించగా, వారిలో 145 మంది వరకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. వీరిలో ఒక్కొక్కరు రూ.10 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తున్నది. ఈ మోసం విలువ తొలుత రూ.200 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేసినప్పటికీ.. బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో అది రూ.500 కోట్ల వరకు ఉండే అవకాశమున్నదని భావిస్తున్నారు. ఈ సొమ్మును నిందితులు ఎక్కడ పెట్టుబడులు పెట్టారు, ఏం ఆస్తులు కొన్నారో తెలుసుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

35 ఏండ్లుగా చిట్‌ఫండ్ వ్యాపారం

తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్(టెస్కాబ్)లో జనరల్ మేనేజర్‌గా పని చేసిన నిమ్మగడ్డ వాణీబాల ఆమె భర్త మేక నేతాజీతో కలిసి 1986లో ప్రియాంక చిట్‌ఫండ్ పేరుతో ఫైనాన్స్ సంస్థను ఏర్పాటు చేశారు. వాణీబాల తమ బ్యాంకుకు వచ్చే డిపాజిట్‌దారులను ప్రియాంక చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని నెలవారీ 24 శాతం వడ్డీ వస్తుందని చెప్పడంతో అధిక వడ్డీకి ఆశపడి చాలామంది వచ్చి చేరారు. నిందితులు అంచెలంచెలుగా తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకున్నారు. ఆ డబ్బుతో ప్రియాంక గ్రాఫిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. కొద్దిరోజులు వీరి వ్యాపారాలు బాగానే ఉన్నప్పటికీ కరోనా ప్రభావం వారిని దెబ్బతీసింది. దీంతో ఫైనాన్స్ డబ్బును రొటేషన్ చేయడంలో తడబడ్డారు. దీంతో ఫైనాన్స్ డబ్బులను ఇతర వ్యాపారాల్లోకి మళ్లించారు. ఈ సమయంలోనే కొందరు ఖాతాదారులు తమ డబ్బును విత్‌డ్రా చేసుకోవడం, వడ్డీలు చెల్లించడంలో తడబాటు రావడంతో కొందరికి అనుమానం వచ్చింది. తమ డబ్బును వాపస్ చేయాలని వారు ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. ఇటు ఆస్తులను కాపాడుకోవడంతోపాటు అటు డిపాజిట్‌దారుల ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు నిందితులు ఐపీ పెట్టాలని నిర్ణయించుకున్నారు. అందుకు ముహూర్తం ఖరారు చేసుకొని మొదట అరుణాచలం వెళ్లి వచ్చి మే 3వ తేదీన ఐపీ ఫైల్ చేశారు. నోటీసులు అందుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గత నెల 30న నేతాజీ, వాణీబాల, శ్రీహర్షలను అరెస్టు చేశారు. వాణీబాల గత నెల 31న పదవీ విరమణ చేశారు.

అధిక వడ్డీ ఇస్తానని 25 కోట్లతో పరార్

మోసపోయిన 150 మంది బాధితులు

నిందితుడి ఇంటి ఎదుట ఆందోళన.. హైదరాబాద్ బోడుప్పల్‌లో ఘటన

పీర్జాదిగూడ, జూన్ 3: అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ. 25 కోట్లతో ఓ వ్యక్తి ఉడాయించిన ఘటన బోడుప్పల్‌లో కలకలం రేపింది. తమ వద్ద తీసుకొన్న డబ్బులు చెల్లించాలని నిందితుడి ఇంటిముందు బాధితులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకెళ్తే... హైదరాబాద్ గోల్నాకకు చెందిన బాసెట్టి నాగరాజు పదేండ్లక్రితం బోడుప్పల్ అక్షయ్‌నగర్ కాలనీలో ఓ ఇంటిని కొనుగోలు చేసుకొని నివాసముంటున్నాడు. ఇతను ఫార్మాస్యూటికల్ వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఫార్మాస్యూటికల్ అమెరికాకు ఆన్‌లైన్ వ్యాపారం చేస్తున్నానని ఇందులో తనకు 25 శాతం లాభం వస్తుందని చెప్పారు. తమరెవరైనా డబ్బులు అప్పు ఇస్తే రూ.10 వడ్డీ ఇస్తానని చుట్టుప్రక్కల వారిని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మాయమాటలతో నమ్మించాడు. బోడుప్పల్‌లో సుమారు 40 మంది రూ. 5 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు నగదుతో పాటు క్రెడిట్ కార్డులు ఇచ్చినట్టు బాధితులు తెలిపారు. 100 నుంచి 150 మంది బాధితుల నుంచి సుమారు రూ. 25 కోట్ల వరకు తీసుకొని కొన్ని నెలల నుంచి అసలు, వడ్డీ ఇవ్వక తప్పించుకొని తిరుగుతున్నాడు. మోసపోయామని తెలుసుకొని బాధితులు గత ఫిబ్రవరి 13న మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దీంతో పరారీలో ఉన్న నాగరాజు ఇంటి ముందు సోమవారం బాధితులు ఆందోళన చేశారు.

చనిపోతానని తెలిసీ బిడ్డకు జన్మ

- రెండు కిడ్నీలు పాడై ఇప్పటికే రెండు సార్లు అబార్షన్
- మూడోసారి ప్రత్యేక కేసుగా తీసుకున్న సుల్తాన్‌బజార్ ప్రభుత్వ దవాఖాన వైద్యులు
- 21 సార్లు డయాలసిస్‌తో స్పెషల్ కేర్
- ఆడబిడ్డకు జన్మనిచ్చిన మహిళ
- ప్రస్తుతం తల్లీబిడ్డ.. ఇద్దరూ క్షేమం

శస్త్రచికిత్స అనంతరం సరితను పరామర్శిస్తున్న దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కె రాజ్యలక్ష్మీ తదితరులు

సుల్తాన్‌బజార్, జూన్ 3: ప్రసవం చేస్తే చనిపోతానని తెలిసినా బిడ్డకు ప్రాణం పోయాలని వైద్యులను వేడుకున్నదో నిండు గర్భిణి. రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేసుకోవటంతో పాటు షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఓ గర్భిణీకి వైద్యులు మొక్కవోని ధైర్యంతో ప్రసవం చేయటంతో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాల్లోకి వెళితే న్యూనల్లకుంట-తిలక్‌నగర్‌కు చెందిన సరిత (22), శ్రీకాంత్ భార్యాభర్తలు. సరితకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. షుగర్, థైరాయిడ్‌తోనూ బాధపడుతున్నది. గతంలో గర్భం దాల్చగా రెండు సార్లు అబార్షన్ అయ్యింది. గత ఏడాది అక్టోబర్‌లో మరోసారి గర్భం దాల్చగా, కోఠిలోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానకు పరీక్షల కోసం వచ్చింది. వైద్యులు పరీక్షించగా రెండు కిడ్నీలు చెడిపోయాయని తేలింది. అప్పటికి ఆమె 20 వారాల గర్భవతి. ప్రసవం జరిగితే చనిపోయే ప్రమాదం ఉన్నదని వైద్యులు తెలిపారు. దీంతో తన ప్రాణాలు పోయినా ఫర్వాలేదని, కడుపులో ఉన్న బిడ్డను మాత్రం బతికించాలని వేడుకొన్నది. వైద్యులు ఈ విషయాన్ని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మికి వివరించారు. ఆమె సరితను స్వయంగా పరీక్షించి, ప్రసవ ఇబ్బందులను వివరించారు. అయినా సరిత ససేమిరా అనటంతో.. ఈ కేసును వైద్యులు చాలెంజ్‌గా తీసుకొన్నారు. కిడ్నీలు ఫెయిల్ కావటంతో ఉస్మానియ దవాఖాన నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ మనీషా సహాయ్ నేతృత్వంలో 21 సార్లు డయాలసిస్ చేయించి, 34 వారాల తర్వాత శనివారం రాత్రి శస్త్రచికిత్స చేసి ప్రసవం చేశారు. సరిత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాప 1.6 కిలోల బరువు ఉన్నట్టు దవాఖాన సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తెలిపారు. సరిత దంపతులు వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నవ్వటం ఆయనకు రోగం!

- హైదరాబాద్‌వాసికి వింత వ్యాధి
- అపోలో హాస్పిటల్‌లో చికిత్స

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): నవ్వటం ఒక భోగం.. నవ్వించటం ఒక యోగం.. నవ్వకపోవటం ఒక రోగం..అని ప్రముఖ దర్శకుడు జంధ్యాల అన్న మాటలివి. కానీ, నవ్వటమే ఒకాయన పాలిట శాపంగా మారింది.నవ్వే సర్వరోగాలకు మందు అని చెప్పే వైద్యులే ఇప్పుడు ఆయనకు చికిత్సనందిస్తున్నారు. 53 ఏండ్ల హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో టీవీ చూస్తూ ఒక్కసారిగా కుర్చిలోంచి కింద పడి స్పృహ కోల్పోయాడు. ఇంట్లోవాళ్లు గమనించి స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కు తరలించి ప్రథమ చికిత్సత అందించగా, స్పృహలోకి రాలేదు. అపోలో హాస్పిటల్‌లో మెరుగైన చికిత్స కోసం తరలించారు. రోగిని పరీక్షించిన వైద్యులు అరుదైన నవ్వు ప్రేరిపిత మూర్ఛగా నిర్ధారించారు. మెదడుకు రక్తప్రసరణ తగ్గిపోవటంతో ఇలాంటి రుగ్మతలు వస్తాయని, జ్ఞాపకశక్తిని కోల్పోయి స్పృహ లేకుండా పోతుందని అపోలో వైద్యులు డాక్టర్ సుధీర్ తేల్చారు. మూర్ఛ వచ్చిన విషయం రోగికి గుర్తుకు ఉండదని, సకాలంలో వైద్యం అందించేలా చూడాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. నవ్వు ప్రేరేపిత మూర్ఛ వ్యాధి అరుదుగా వస్తుందని పేర్కొన్నారు.

జడ్జీల ఫోన్ ట్యాపింగ్‌పై నేడు విచారణ

వార్తలను సుమోటో పిటిషన్‌గా స్వీకరించిన హైకోర్టు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): కొంతమంది తెలంగాణ పోలీసు అధికారులు రాజకీయ నేతలతోపాటు న్యాయమూర్తుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారంటూ కొన్ని ఇంగ్లిష్, తెలుగు దినపత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ వ్యవహారంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరుపనుంది. ఎస్ఐబీ చీఫ్ టీ ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో మేకల తిరుపతన్న, డీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ జీ రాధాకిషన్‌రావు ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టుగా కేసులు నమోదయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శరత్ ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేసినట్టు ఎస్ఐబీలో ఏఎస్సైగా పనిచేసిన భుజంగరావు పోలీసుల దర్యాప్తులో అంగీకరించినట్టు వార్తలు వచ్చాయి. ఈ వార్తలను హైకోర్టు పరిశీలించిన తర్వాత పిటిషన్‌గా స్వీకరించి విచారణకు నిర్ణయించింది.

'హైపవర్ కమిటీ ఏం చేసిందో చెప్పండి'

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ పరీవాహక ప్రాంతాల పరిరక్షణకు ఏర్పాటైన హైపవర్ కమిటీ ఏం చేసిందో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవో 111 రద్దు తోపాటు జీవో 69ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు సోమవారం మరోసారి విచారణకు రావడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

కవిత కస్టడీ పొడిగింపు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్న కవిత కస్టడీ సోమవారంతో ముగిసింది. దీంతో ఆమెను సోమవారం రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ నెల 7న చార్జిషీట్ దాఖలు చేస్తామని సీబీఐ తెలిపింది. దీంతో విచారణను ఈ నెల 7కు వాయిదా వేసిన న్యాయస్థానం కవిత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 7 వరకు పొడిగించింది. ఇక ఈడీ కేసులో కవిత కస్టడీని జూలై 3వ తేదీ వరకు పొడిగించింది.

నిమ్స్ వైద్యులకు గవర్నర్ రాధాకృష్ణన్ అభినందన

ఖైరతాబాద్, జూన్ 3 : ఓ ఆదివాసీ యువకుడికి గుండె, ఊపిరితిత్తుల మధ్య గుచ్చుకున్న బాణాన్ని విజయవంతంగా శస్త్రచికిత్స చేసి తొలగించిన నిమ్స్ వైద్య బృందాన్ని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ అభినందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఉసూరు మండలం, ధర్మారం గ్రామానికి చెందిన సోడి నంద అడవి పందిని వేటాడే క్రమంలో బాణం గుచ్చుకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత యువకుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎం దవాఖాన వైద్యుల సూచన మేరకు నిమ్స్‌కు తరలించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వర్ రావు, డాక్టర్ గోపాల్ బృందం శస్త్రచికిత్స నిర్వహించి బాణాన్ని తొలగించి యువకుడిని కాపాడారు. విషయం తెలుసుకున్న గవర్నర్ రాధాకృష్ణన్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పతో పాటు వైద్య బృందాన్ని పిలిపించుకొని శాలువా, మెమోంటోలతో సత్కరించారు.

రాధాకిషన్‌రావు తల్లి కన్నుమూత

అంత్యక్రియల హాజరుకు కోర్టు అనుమతి

నాంపల్లి కోర్టులు, జనగామ జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న డీసీపీ రాధాకిషన్‌రావుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి పొట్లపల్లి సరోజనాదేవి (99) సోమవారం కరీంనగర్‌లోని కుమార